నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, బుధవారం 17 ఏప్రిల్ 2024 | SURYAPET

బీఆర్ఎస్ ఎన్నికల సమన్వయకర్తల నియామకం

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించారు. భువనగిరి లోక్‌సభ పరిధిలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, మునుగోడుకు జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, భువనగిరికి రాష్ట్ర నాయకుడు నంద్యాల దయాకర్ రెడ్డి, నకిరేకల్‌కు జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, తుంగతుర్తికి మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, ఆలేరుకు ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, జనగామకు యాదాద్రి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డిను సమన్వయ కర్తలుగా నియమించారు.

నల్లగొండ లోక్ సభ స్థానంలో.. నల్లగొండ నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, నాగార్జున సాగర్‌కు జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, హుజూర్‌నగర్‌కు రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నరసింహారెడ్డి, దేవరకొండకు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, మిర్యాలగూడకు మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, కోదాడకు రాష్ట్ర నేత కటికం సత్తయ్య గౌడ్, సూర్యాపేటకు మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఇస్లావత్ రామచందర్ నాయక్‌ను నియమిస్తూ కేటీఆర్ ఆదేశాలు ఇచ్చారు.

నాలుగు నెలల్లోనే రాష్ట్రాన్ని ఆగం పట్టించిండ్రు

- ఇస్తానన్న హామీలు దాటేస్తూ వస్తున్నరు
- కాంగ్రెస్ మోసాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలి
- రైతు బిడ్డ కంచర్ల కృష్ణారెడ్డిని పార్లమెంట్‌కు పంపించాలి
- దేవరకొండ, హాలియాలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

రైతులు గోస పడుతున్నరు

చందంపేట (దేవరకొండ)/ దేవరకొండ రూరల్/ హాలియా, ఏప్రిల్ 16 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి చేసుకున్న తెలంగాణను కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలో ఆగం పట్టించిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. దేవరకొండ పట్టణంలో మంగళవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అధ్యక్షతన ఆ పార్టీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. అదేవిధంగా హాలియా పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అధ్యక్ష తన నాగార్జున సాగర్ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో రైతులు, అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడాన్ని గుర్తుచేశారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వంద రోజులైనా అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. రైతులు గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోతుంటే మంత్రులకు పరిశీలించే సమయం కూడా లేకుండా పోతున్నదని, రైతులను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో చేరికల కోసం గేట్లు ఎత్తామని చెబుతున్న ముఖ్యమంత్రి ముందు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి రైతులను ఆదుకోవాలని సూచించారు. కొందరు నేతలు స్వలాభం కోసం పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చే నష్టమేమీ లేదని, గ్రామ స్థాయిలో పటిష్టమైన క్యాడర్ ఉన్నదని అన్నారు. వంద రోజుల్లో 200 మంది రైతులు చనిపోవడాన్ని తట్టుకోలేక మాజీ సీఎం కేసీఆర్ ఎండిన పంటలను పరిశీలించారని తెలిపారు. చనిపోయిన రైతుల వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి అడిగితే కేసీఆర్ నాలుగు గంటల్లోనే పంపితే స్పందించకుండా గమ్మున ఉండిపోయారని పేర్కొన్నారు. కేసీఆర్ కరీంనగర్ వెళ్తానంటే కాళేశ్వరం గేట్లు ఎత్తి నీళ్లు వదిలారని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో శాంతిభద్రతలు, రైతుల సంక్షేమం, వృత్తిదారుల గురించి ఆలోచించేవారన్నారు. బీఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో ఎవరిపైనా అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేయలేదని పేర్కొన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని చెప్పి వంద రోజులు దాటినా చేయని సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, మహిళలకు రూ.2,500, నెలకు రూ.4వేల పెన్షన్ ఇలా ఎన్నో మోసపూరిత పథకాలతో అధికారంలోకి వచ్చి నేడు విస్మరిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించి.. కాంగ్రెస్ వైఫల్యాలను, మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త కేసీఆర్‌లా పని చేసి బీఆర్ఎస్ అభ్యర్థి, రైతు బిడ్డ కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేవరకొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వడ్త్య రమేశ్‌నాయక్, గాజుల ఆంజనేయులు, బిల్యానాయక్, నేనావత్ కిషన్‌నాయక్, జర్పుల లోక్యానాయక్, మండలాధ్యక్షులు టీవీఎన్ రెడ్డి, వల్లపురెడ్డి, వెంకటేశ్వర్‌రావు, దర్గూనాయక్, శంకర్‌నాయక్, ఎంపీపీ సునీతాజానార్దన్‌రావు, నాయకులు గోవిందుయాదవ్, పల్లా ప్రవీణ్‌రెడ్డి, నీలా రవి, కంకణాల వెంకట్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ముడావత్ శ్రీను, తౌఫిక్, రహత్‌అలీ, ఇలియాస్ పటేల్, బాబా, రాజు, కృష్ణ, బాలయ్య, రాము లు, రాములుగౌడ్, రవి, నర్సయ్య పాల్గొన్నారు.

హాలియాలో జరిగిన సమావేశంలో అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, పార్టీ రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, ఇస్లావత్ రాంచందర్‌నాయక్, యడవల్లి విజయేందర్‌రెడ్డి, కడారి అంజయ్యాదవ్, కట్టెబోయిన గురువయ్యాదవ్, ఎంపీపీలు సుమతీ పురుషోత్తం, అనూరాధ సుందర్‌రెడ్డి, బొల్లం జయమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కేవీ రామారావు, నాయకులు జవ్వాజి వెంకటేశ్వర్లు, కామర్ల జానయ్య, యడవల్లి మహేందర్‌రెడ్డి, ఎక్కలూరి శ్రీనివాస్‌రెడ్డి, కూరాకుల వెంకటేశ్వర్లు, రవినాయక్, నాగయ్య, సత్యపాల్, సతీశ్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

దేవరకొండ బీఆర్ఎస్ సమావేశంలో నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, నాయకులు బూడిద భిక్షమయ్యగౌడ్, ఒంటెద్దు నర్సింహారెడ్డి, తదితలు

హాలియాలో సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

హాలియాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ తదితరులు

దేవరకొండలో సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఆదరించండి.. ప్రశ్నించే గొంతుకనవుతా

రైతు బిడ్డగా మీ ముందుకు వస్తున్నా. నల్లగొండ ఎంపీగా అవకాశం ఇవ్వండి.. మీకోసం ప్రశ్నించే గొంతుకనవుతా. రైతు బిడ్డ కేసీఆర్ ఏవిధంగానైతే రైతుల కోసం చేశాడో.. నేను కూడా రైతులతోపాటు అన్ని వర్గాల ప్రజల కోసం సేవకుడిగా పనిచేస్తా. రైతు మీదున్న అభిమానంతో ఎప్పటి నుంచో నా భూమిని, నా సొంత ఊరిలో ఫ్రీగా కౌలుకు ఇస్తున్నా. పత్తి గిట్టుబాటు ధర కోసం పోరాటం చేస్తా. నల్లగొండ జిల్లాలో గిరిజన జనాభా ఎక్కువ ఉన్నందున గిరిజన యూనివర్సిటీ కోసం పార్లమెంటులో గళం విప్పుతా. నక్కలగండి, డిండి ఎత్తిపోతల కోసం కృషి చేస్తా. దేవరకొండ ప్రజలు ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న రైల్వేలైన్ కలను నెరవేరేలా కృషి చేస్తా. సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేలా ప్రభుత్వంపై కొట్లాడుతా. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసేందుకు, ప్రతి మండలానికి 100 పడకల ఆసుపత్రి కోసం కృషి చేస్తా. కాంగ్రెస్ అభ్యర్థుల మోసపూరిత మాటలు నమ్మొద్దు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులైనా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్నారు. పంటలు ఎండిపోతున్నా, ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నా ఏ ఒక్క మంత్రి, ఎమ్మెల్యే కూడా నోరుమెదపటం లేదు. కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని విమర్శిస్తూ పరిపాలను, హామీలను గాలికి వదిలేశారు. మతం పేరుతో బీజేపీ రాజకీయం చేయాలని చూస్తున్నది. అయినా వారిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు.

-కంచర్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి

ఆరు గ్యారెంటీలు అమలయ్యే వరకు వెంటాడుతాం

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలయ్యే వరకు వెంటాడుతాం. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ నాయకులను నమ్మి మోసపోవద్దు. ఎప్పుడూ ప్రజల పక్షాన నిలిచే బీఆర్ఎస్ పార్టీ ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సాగు, తాగునీటి కష్టాలు తెచ్చింది. కేసీఆర్ పదేండ్ల పాలనలో సాగు, తాగునీటి కోసం రాని కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మళ్లీ మొదలయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో రైతుబంధు ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదు. ఇప్పుడు మళ్లీ అవే మోసపూరిత మాటలతో ఓట్లు అడగటానికి వస్తున్నది. వారి మాటలను నమ్మొద్దు. కాంగ్రెస్ అంటేనే ప్రజలను దోచుకునే పార్టీ. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలి.

- రమావత్ రవీంద్రకుమార్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

ప్రశ్నించే గొంతుక కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలి. కేసీఆర్ పాలనలో ఏ ఒక్క మహిళా బిందెలు పట్టుకొని రోడ్డు మీదికి రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరెంట్, తాగు, సాగునీటి కష్టాలు వచ్చాయి. అబద్ధపు మాటలు, బూటకపు హామీలతోఅధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. నిరుద్యోగ భృతి, రూ.2లక్షల రుణమాఫీ, వరికి రూ.500 బోనస్ హామీలను పక్కనపెట్టి మళ్లీ మోసపూరిత మాటలతో ఓట్లు వేయించుకోవాలని వస్తున్న కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలి. ఎప్పుడూ ప్రజల పక్షాన నిలిచే పార్టీ పార్టీ బీఆర్ఎస్. పార్లమెంటులో తెలంగాణ గళాన్ని వినిపించే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలి.

- బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



నాగార్జున సాగర్ నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యం. నెల్లికల్, కుకుడుచెట్టుతండా లిఫ్ట్‌లను తీసుకొచ్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే. గతంలో కాంగ్రెస్ పార్టీ కోర్టుల్లో కేసులు వేసి నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వాటి అమలులో విఫలమైంది. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి.

- నోముల భగత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

కంచర్ల కృష్ణారెడ్డిదే విజయం

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనపై పూర్తి వ్యతిరేకంగా ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలువబోతున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలి.

- బండ నరేందర్‌రెడ్డి, నల్లగొండ జడ్పీ చైర్మన్

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు తథ్యం

చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్పలేకపోవడం.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల నిర్లక్ష్యం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఇప్పుడు ఆ పరిస్థితి రావద్దు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయం.

- ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్సీ

మూడు కుటుంబాల చేతిలో బందీ అయిన కాంగ్రెస్

జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో చీము, నెత్తురు లేదు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మూడు కుటుంబాల చేతిలో బందీ అయ్యింది. నాగార్జున సాగర్‌లో కుందూరు జానారెడ్డి, ఆయన కుమారులు, నల్లగొండ, మునుగోడులో కోమటిరెడ్డి బ్రదర్స్, కోదాడ, హుజూర్‌నగర్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి రాజ్యమేలుతున్నారు. మాకు టికెట్ కావాలని అడిగే దమ్ములేని నాయకుడు కాంగ్రెస్ పార్టీలో లేడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి రైతు కుటుంబం నుంచి వచ్చిన కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలి. కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు చరమగీతం పాడాలి.

- ఒంటెద్దు నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిచందన, పక్కన ఎస్పీ చందన దీప్తి

రేపే పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్

నామినేషన్ల స్వీకరణకు శ్రీకారం

- ఈ నెల 25 వరకు స్వీకరణ
- పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ హరి చందన
- కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు : ఎస్పీ చందన దీప్తి

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్16(నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో రేపటి నుంచి కీలక ఘట్టానికి తెర లేవనుంది. గురువారం ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేయడంతో నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి మంగళవారం నల్లగొండ కలెక్టరేట్‌లో ఎస్పీ చందన దీప్తి తో కలిసి కలెక్టర్ హరి చందన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన మాట్లాడుతూ లోకసభ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 18న నోటిఫికేషన్ జారీ చేయడంతోపాటు, ఆ రోజు నుంచే నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. ఈ నెల18 నుంచి 25 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నల్లగొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. సెలవు దినాల్లో నామినేషన్ల స్వీకరణ ఉండదని, పోటీ చేసే అభ్యర్థులు ఫామ్-2ఏ లో అన్ని వివరాలను పూరించి నామినేషన్ దాఖలు చేయాలని చెప్పారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల వరకు గరిష్టంగా నామినేషన్ పత్రాలు దాఖలు చేయొచ్చన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే జనరల్ అభ్యర్థులు రూ. 25 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 సెక్యూరిటీ డిపాజిట్‌తోపాటు, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని తెలిపారు. గుర్తించిన రాజకీయ పార్టీల అభ్యర్థులను ఒకరు ప్రతిపాదిస్తే సరిపోతుందని, గుర్తింపు పొందని రాజకీయ పార్టీ, అలాగే స్వతంత్ర అభ్యర్థులను మాత్రం పదిమంది ప్రతిపాదించాల్సి ఉంటుందని చెప్పారు. నామినేషన్‌తోపాటు ఫామ్-26 ద్వారా ఆఫిడవిట్ దాఖలు చేయాలని, అఫిడవిట్‌లో విద్యార్హతలు, కేసులు, క్రిమినల్ యాంటిసిడెన్స్ తప్పనిసరిగా పొందుపర్చాలని తెలిపారు. పోటీ చేసే అభ్యర్థి 25 సంవత్సరాలు వయసు ఉండి, ఏదైనా నియోజకవర్గం నుంచి ఓటరుగా నమోదై ఉండాలని అన్నారు. ఇతర నియోజక వర్గాల వారు అయితే సంబంధిత రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువపత్రాన్ని తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్‌కు ముందే ఎన్నికల ఖర్చు నిర్వహణ కోసం ఏదేని జాతీయ బ్యాంకులో అకౌంట్ తెరువాలని, నామినేషన్ వేసే ముందు బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలన్నారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో 2,061 పోలింగ్ స్టేషన్‌లలో 17,22,521 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 18-19 వయసు వారు 60,116 మంది, 85 సంవత్సరాలు నిండిన వారు 9,587 మంది ఉన్నారని చెప్పారు. వీరితో పాటు పీడబ్ల్యూడీ ఓటర్లు 33,865 మంది, సర్వీస్ ఓటర్లు 736 మంది ఉన్నారన్నారు. సీనియర్ సిటిజన్స్‌తోపాటు దివ్యాంగులకు హోం ఓటింగ్ సదుపాయం కల్పించామని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా 100 మీటర్ల పరిధిలో ఇతరులకు అనుమతి ఉండదని, అభ్యర్థితోపాటు మరో నలుగురు వ్యక్తులు, మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్నికలకు సంబంధించి ఆన్‌లైన్‌లో అయితే సువిధ యాప్ ద్వారా, ఆఫ్‌లైన్‌లో అయితే ఏఆర్ఓ కార్యాలయాలలో అనుమతులు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్పీ చందన దీప్తి మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన దగ్గర నుంచి ఇప్పటివరకు రూ.9.18 కోట్ల విలువగల నగదు, మద్యం, ఆభరణాలు సీజ్ చేశామన్నారు. 3 అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు వాడపల్లి, నాగార్జునసాగర్ అడవిదేవులపల్లిలో ఏర్పాటు చేసి తనిఖీ పటిష్టం చేశామని తెలిపారు. వీటితోపాటు అంతర జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, ఎక్కడ ఏ చిన్న అనుమానం వచ్చినా తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తున్నామని, ఇప్పటివరకు 184 కేసుల్లో నగదు, ఆభరణాలు వంటివి సీజ్ చేశామని చెప్పారు. ఈ సమావేశంలో స్పెషల్ కలెక్టర్ నటరాజ్, మీడియా నోడల్ అధికారి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ కోటేశ్వర్‌రావు, కేంద్ర ప్రభుత్వ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ కోటేశ్వర్‌రావు, సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు

పెద్ద ఎత్తున ధాన్యం మాయమైనట్లు గుర్తించిన విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు

నాలుగు మిల్లుల్లో ధాన్యం నిల్వల పరిశీలన

కోదాడలోని రైస్ మిల్లులో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సూర్యాపేట, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ)/కోదాడ రూరల్/తిరుమలగిరి : సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా పలు రైస్ మిల్లుల్లో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్, పోలీసు అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇటీవల మిల్లుల్లో జరుగుతున్న అక్రమాలు, సీఎంఆర్ ప్రభుత్వానికి సకాలంలో ఇవ్వకపోవడం తదితరాలపై నమస్తే తెలంగాణ పత్రికలో వరుసగా ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. ఈ మేరకు తిరుమలగిరి మండల కేంద్రంలోని సంతోషి, నాగారం మండల పరిధిలోని రఘురామతోపాటు సూర్యాపేటలో జగన్మాత, కోదాడలో శ్రీవేంకటేశ్వర ఫార్‌బాయిల్డ్ మిల్లుల్లో అధికారులు తనిఖీలు చేశారు. అదనపు కలెక్టర్ ప్రియాంక, సూర్యాపేట, కోదాడ ఆర్డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ రాములు, డీఎస్ఓ మోహన్‌బాబుతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి మూడు ప్రాంతాల్లోని మిల్లుల్లో సోదాలు చేశారు. రికార్డులను పరిశీలించి ఆయా మిల్లులకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి ఎంత ధాన్యం వెళ్లింది? కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను తిరిగి ప్రభుత్వానికి ఎంత ఇచ్చారు? అనేది గుర్తించారు. ఇంకా మిల్లుల్లో ఉండాల్సిన ధాన్యం లెక్కలు తేల్చారు. ఆయా మిల్లుల్లో రూ.150 కోట్ల నుంచి రూ.300 కోట్ల విలువ చేసే ధాన్యం ఉండాల్సి ఉండగా పెద్దఎత్తున ధాన్యం మిల్లుల్లో కనిపించడం లేదని తెలిసింది. కోదాడలోని శ్రీ వేంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్‌లో 2022-23, 2023-24 సంవత్సరాలకు మూడు సీజన్‌లు కలిపి 21,300 టన్నుల బియ్యం ప్రభుత్వానికి పెండింగ్ ఉందని, దీని విలువ సుమారు రూ.90 కోట్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. అధికారులు, సిబ్బంది మిల్లుల్లో ఉన్న ధాన్యం బస్తాలను లెక్కించడానికి మరో రోజు కూడా సమయం పడుతుందని, తదనంతరమే ఏయే మిల్లుల్లో ఎంత ధాన్యం ఉంది? తక్కువ ఎక్కడ ఉంది? అనే విషయాలు తెలుస్తాయని అధికారులు అంటున్నారు. ప్రధానంగా గత రెండు సీజన్ల నుంచి ధాన్యం తీసుకొని ఒక్క కిలో కూడా బియ్యం ఇవ్వని 6 మిల్లులతోపాటు గతంలో సకాలంలో రైస్ ఇవ్వక డిఫాల్ట్ అయిన 32 మిల్లులపై అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం నాలుగు మిల్లుల లెక్క తేలనుండగా, ఆ వెంటనే మిగిలిన మిల్లుల్లో తనిఖీలు చేయనున్నట్లు సోదాల్లో పాల్గొన్న అధికారులు తెలిపారు.

సివిల్స్‌లో మెరిసిన అల్వాల యువకుడు

- ఆల్ ఇండియా 173వ ర్యాంకు సాధించిన ధీరజ్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 16 : యూపీఎస్సీ మంగళవారం వెలువరించిన సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం అల్వాల గ్రామానికి చెందిన పెంకీస్ ధీరజ్‌రెడ్డి ఆల్ ఇండియా 173వ ర్యాంకును సాధించాడు. పెంకీస్ సత్యనారాయణరెడ్డి హేమలత కుమారుడు ధీరజ్‌రెడ్డి సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేర్ అయ్యాడు. మూడు అంటెప్ట్‌లు ఇచ్చి రెండు సార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లి నప్పటికీ సెలెక్ట్ కాలేకపోయాడు. ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే తపనతో కష్టపడి చదివాడు. 2023లో యూపీఎస్సీ నిర్వహించిన పరీక్షకు హాజరై ప్రిలిమ్స్, మెయిన్స్ క్వాలిఫై అయ్యి ఇంటర్వ్యూకు వెళ్లాడు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో ఆల్ ఇండియా 173వ ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రుల సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. ఈ సందర్భంగా ధీరజ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ర్యాంక్‌తో తనకు ఈ సారి ఐపీఎస్ లేదా ఐఆర్ఎస్ వస్తుందని, ఉద్యోగం చేసుకుంటూనే తిరిగి సివిల్స్‌కు ప్రిపేర్ అయి ఐఏఎస్ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. సివిల్స్‌లో ర్యాంకు సాధించిన ధీరజ్‌రెడ్డిని స్నేహితులు, బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

ధీరజ్‌రెడ్డి

శ్రీరామ నవమి శుభాకాంక్షలు
జ్యోతి ఐకాన్ హార్ట్‌కేర్ సెంటర్
జ్యోతి హాస్పిటల్, మిర్యాలగూడ.
ముందు జాగ్రత్తలు తీసుకోండి....హాయిగ